
# భారత్‌పై
# ట్రంప్ సుంకాల యుద్ధం




**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**

ఆంధ్రప్రదేశ్ కమిటీ

# ముందుమాట

**– వి. శ్రీనివాసరావు**

***సిపిఐ(ఎం), ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి***

**ట్రంప్** టారిఫ్ టెర్రరిజం భారత్‌దేశంపై అమానుషంగా దాడిచేస్తోంది. ఒకవైపు వీసాల ఆంక్షలపై ఎన్‌ఆర్‌ఐ ఉద్యోగులు, విద్యార్థుల గుండెల్లో రైళ్లు పరిగెడుతన్నాయి. రోజుకొక ప్రకటనతో వారి భవిష్యత్తుతో చెలగాటమాడుతోంది. మరొకవైపు భారతదేశం నుండి ఆమెరికాకు ఎగుమతి అయ్యే వస్తువులపై టారిఫ్‌లు పెంచి ఉత్పత్తిని దెబ్బతీస్తున్నది. ఫలితంగా వేలాది మంది ఉద్యోగులు, కార్మికుల భవిషత్తు ప్రమాదంలో పడింది. ఆమెరికా నుంచి భారతదేశానికి పన్నులు లేకుండా డైరీ, వ్యవసాయ ఉత్పత్తులను దిగుమతి చేసుకోవాలని ఒత్తిడి చేస్తున్నది. అదే జరిగితే వ్యవసాయ రంగం సంక్షోభంలో పడుతుంది. గిట్టుబాటు ధరలులేక అప్పులపాలై దివాళా ఎత్తవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికే రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. ఈ స్థితిలో భారతదేశ యువత భవిష్యత్తును కాపాడాల్సిన మోడీ ప్రభుత్వం చేష్టలుడికి వ్యవహరిస్తున్నది. చివరకు మన ఆత్మగౌరవంపై దెబ్బతీస్తున్నా ఆత్మ నిర్భర్ అంటూ కూనీ రాగాలు తీస్తున్నారు తప్ప అమెరికా దుశ్చర్యను కనీసం నోరెత్తి ఖండించడం కూడా చేతకావడం లేదు. మన కన్నా చిన్న దేశాలు ఎదురుతిరుగుతున్నాయి. మోడీ ప్రభుత్వం దేశ ప్రయోజనాలను ఫణంగా పెట్టి ఆమెరికాతో బంధాన్ని బలపరుచుకోవడానికి ప్రయత్నిస్తున్నది. అమెరికాతో స్నేహాన్ని పునరుద్ధరించుకోవడానికి ట్రంప్ మెప్పుకోసం తహతహలాడుతున్నారు. అలకబూని రష్యా, చైనాల సరసకు చేరుతున్నట్లు నటించి ట్రంప్‌కు దగ్గర అవుదామని ప్రయత్నిస్తున్నారు. ట్రంప్ టారిఫ్ టెర్రరిజం, మోడీ లొంగుబాటుకు వ్యతిరేకంగా సిపిఐ(ఎం) దేశవ్యాప్త క్యాంపియన్‌కు పిలుపునిచ్చింది.

మన రాష్ట్రంపై ట్రంప్ టారిఫ్‌ల దాడి ప్రభావం చాలా ఎక్కువగా ఉంది. గత ముప్పై సంవత్సరాల్లో లక్షల మంది తెలుగువారు అమెరికాలో ఉద్యోగాలు చేసుకుంటున్నారు. వీళ్లలో అత్యధిక భాగం హెచ్ 1బి వీసా మీదనే పనిచేస్తున్నారు. ఇప్పుడు వారందరి భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుంది. కుటుంబం, పిల్లలతో మధ్య వయసులోకి వచ్చిన వారు.. రెండు విధాలా ఆపదలను ఎదుర్కొంటున్నారు. ఒకటి.. ఏఐ నేపథ్యంలో వారి నైపుణ్యం చాలక జీతాలు ఎక్కువ డ్రా చేస్తున్నారన్న నెపంతో మైక్రోసాఫ్ట్, గూగుల్, కాగ్నిజెంట్, ఎక్సంచర్, టీసీఎస్ వంటి కంపెనీలు వేల మందిని నిర్థాక్షిణ్యంగా తొలగిస్తున్నాయి. మరోవైపు వీసాల పునరుద్దరణకు అనుమతి వస్తుందో రాదోనన్న భయం ఇండియాకు వస్తే తిరిగి వెళ్లలేమన్న నిరాశలో కొట్టుమిట్టాడుతున్నారు. ట్రంప్ ఆంక్షలతో ఎప్పుడు ఉద్యోగం పోతుందో తెలియని పరిస్థితి. అమెరికాలో ఉంటూ చదువుకుంటున్న వారికి వారానికి 20 గంటలు పనిచేసుకునే వెసులుబాటు

ఉండేది. సంపాదించుకుంటూ చదవడం ద్వారా ఇండియాలో ఉన్న తల్లిదండ్రులపై భారం లేకుండా చూసుకుంటున్న విద్యార్థులపై విద్వేషాలు రగిలిస్తున్నాడు. ఇది అమెరికన్ల దేశమనీ, ఇతరత దేశాలవాళ్ళు ముఖ్యంగా ఆసియా, యూరప్ వాళ్లు ఉండకూడదని, తమ సంపద, ఉద్యోగాలు దోపిడి చేస్తున్నారని దుష్ప్రచారం చేస్తున్నారు. అంతేకాదు, తాము క్రిస్టియన్లమని ఇతర మతస్థులు ముఖ్యంగా హిందువులు ఉండరాదని కూడా రెచ్చగొడుతున్నారు. బొట్టు పెట్టుకున్నారనే నెపంతో మహిళలను అవమానిస్తున్న ఘటనలు కూడా ఉన్నాయి. రంగు, జాతి భేదాలను ముందుకు తెచ్చి వివక్షత పునరుద్ధరించే ప్రయత్నం చేస్తున్నారు. భారత దేశంలో ఆర్ఎస్ఎస్, బిజెపిలు రెచ్చగొడుతున్న రీతుల్లోనే అమెరికాలో ట్రంప్, అతని అనుచరవర్గం విద్వేషాలను రెచ్చగొడుతున్నారు. ఇది ప్రత్యేకించి తెలుగు ప్రజలకు ముప్పుగా పరిగణమిస్తున్నది. అమెరికాలో ఉద్యోగాలు చేసుకుంటున్న లేదా చదువుకుంటున్న వారి కుటుంబాలు మన రాష్ట్రంలో ఆందోళనకు గురవుతున్నాయి. వీటిపై మన ముఖ్యమంత్రి లేదా కూటమి నాయకులు పల్లెత్తు మాట మాట్లాడటం లేదు. ఐటీ ఉద్యోగాలన్నీ తానే సృష్టించానని గొప్పలు చెప్పుకుంటున్న చంద్రబాబు ఇప్పుడు ఆ ఐటీ భవిష్యత్తుకే ముప్పు వస్తుంటే నోరు మెదపకపోవడం అన్యాయం. కంపెనీలతో ప్రత్యక్ష సంబంధాలున్న చంద్రబాబు వారి ద్వారా అమెరికా ప్రభుత్వంపైన లేదా కేంద్రంలో ఉన్న భాగస్వామ్యంతో మోడీతో ఉన్న స్నేహం దృష్ట్యా తన పలుకుపడి ఉపయోగించి ఆపవచ్చు. అసెంబ్లీలో తీర్మానం చేయవచ్చు. కానీ ఇవేమీ వారు చేయలేదు.

మన దేశం నుంచి ఎగుమతి అయ్యే రొయ్యలు, డైమండ్ తదితర అభరణాలు, మందులు, బట్టలు ఆఖరికి సినిమాలపైన కూడా పన్నులు వేస్తున్నారు. అనకాపల్లి, శ్రీ సత్యసాయి జిల్లాల్లో వేలాది మంది మహిళలు గార్మెంట్ పరిశ్రమల్లో పనిచేస్తున్నారు. వారికి వచ్చే జీతాలే తక్కువ. ఇప్పుడు ఆ పరిశ్రమలు కూడా సంక్షోభంలో పడటంతో ఉత్పత్తి తగ్గించుకోవడం, ఉద్యోగులపై కోత విధించడం మొదలయింది. గోదావరి జిల్లాల నుంచి నెల్లూరు వరకు విస్తరించిన ఆక్వా పరిశ్రమపై పెద్దఎత్తున ప్రభావం పడింది. పెరిగిన టారిఫ్‌లతో ఎగుమతులు ఆగిపోయాయి. ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటివరకు ఫార్మాపై ఎటువంటి ప్రభావం ఉండదనుకున్నా ఇప్పుడు వాటిపైనా ట్రంప్ కన్నుపడింది. ఆఖరికి ఇండియా నుంచి ఎగుమతి అయ్యే భారతీయ సినిమాలను కూడా వదలకుండా పన్నులు వేస్తున్నారు. సినిమా నిర్మాతలకు వచ్చే ఆదాయంలో విదేశీ హక్కులు పెద్దభాగం. ఇప్పుడు అవీ పడిపోతే సినిమా పరిశ్రమలో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు వీధిపాలవుతున్నారు.

ట్రంప్ ఒత్తిడికి లొంగి వ్యవసాయ ఉత్పత్తులని స్వేచ్ఛగా దిగుమతి చేసుకుంటే డైరీ (పాలు, పాల ఉత్పత్తులు), మొక్కజొన్న, పండ్లు.. ఆఖరికి గోధుమలు కూడా దిగుమతి అవుతాయి. ఇప్పటికే అమెరికాతోపాటు మన మిల్లర్ల ఒత్తిడికి లొంగి డిసెంబర్ వరకు

పత్తిపై దిగుమతి సుంకం ఎత్తివేశారు. ఫలితంగా ఈ సంవత్సరం మరోసారి పత్తిరైతుపై దెబ్బపడనుంది. వచ్చే సీజన్ కూడా దీని ప్రభావం ఉంటుంది. మనరాష్ట్రంలో వ్యవసాయ రంగం సంక్షోభంలో పడినప్పుడల్లా పేద, మధ్య తరగతి రైతులను పాడి పరిశ్రమ ఆదుకుంటున్నది. ఇప్పుడు అమెరికా డైరీ ఉత్పత్తుల దిగుమతి జరిగితే ఆ అండ కూడా పోతుంది. వ్యవసాయ సంక్షోభం ప్రభావంతో లక్షలాది మంది కూలీలు వలస బాట పట్టాల్సి వస్తుంది. వారికి ఉపాధి దొరక్క, దొరికినా తక్కువ వేతనాలతో వారి జీవితాలు మరింత దుర్భరం అవుతున్నాయి. కౌలు రైతులకు వ్యవసాయం గిట్టుబాటు కాక తప్పుకోవాల్సి వస్తుంది. ఈ పరిణామాలు ఆహార భద్రతకు ముప్పు తెస్తాయి. చివరకు రేషన్ ద్వారా సరఫరా చేసే బియ్యాన్ని సైతం దిగుమతి చేసుకోవాల్సి వస్తే దేశం అధోగతి పాలవుతుంది. ప్రజల సంక్షేమభారాన్ని భరించలేక ప్రభుత్వాలు ఆ బాధ్యత నుంచి తప్పుకుంటాయి.

అమెరికా సంక్షోభంతో విదేశీ ఎగుమతులకున్న అవకాశాలు కూడా మృగ్యమవుతున్నాయి. ఇప్పటివరకు ట్రంపుతో చెట్టాపట్టాలేసుకొని తిరిగిన మోది ట్రంపు చర్యలతో దిమ్మతిరిగిపోయింది. ఇప్పుడు హఠాత్తుగా జ్ఞానోదయం అయినట్లుగా విదేశాలపై ఆధారపడటమే మనకు ప్రధాన శత్రువని ప్రకటించారు. వెంటనే దాన్ని అందిపుచ్చుకొన్న చంద్రబాబు మోది మాటలను బలపరుస్తూ ప్రకటన చేశారు. ఇప్పటికీ దేశదేశాలు చుట్టు తిరుగుతూ పెట్టుబడులకోసం వెంపర్లాడుతున్న మోది, చంద్రబాబు ద్వయం ఆత్మ నిర్భర్ భారత్ పేరుతో ప్రజలను మరోసారి వంచించాలని చూస్తున్నారు. ఒకవైపు విదేశాలపై ఆధారపడకూడదని అంటూనే మరొవైపు మన పత్తి రైతులను సంక్షోభంలోకి నెట్టేవిధంగా అమెరికా నుండి పన్ను లేకుండా పత్తి దిగుమతి చేసుకొనేందుకు అనుమతినిచ్చారు. అమరావతిలో ఇన్నోవేషన్ హబ్బు, క్వాంటమ్ హబ్బు, ఏఐ క్లబ్బా అంటూ ఐబియం, మైక్రోసాఫ్ట్ వంటి విదేశీ కంపెనీలకే ఆధిపత్యం కట్టబెట్టారు. వారి ఆత్మనిర్భర భారత్ నినాదం అసలు రంగు ఇదే.

ఈ విషపరిణామాలను నివారించాలంటే అమెరికా దుర్మార్గ దాడిని ఎదుర్కోవడం ఒక్కటే మార్గం. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం, కూటమి నేతలు, ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న వైసీపీ, ఆపార్టీ అధినేత జగన్ మోహన్ రెడ్డి, కేంద్ర పాలకులకు భయపడి నోరెత్తడం లేదు. ఈ స్థితిలో ప్రజలే గళమెత్తాలి. ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచాలి. అంతర్జాతీయంగా మన దేశ ప్రయోజనాల పర్యవేక్షణకు స్వయం పోషణకు అమెరికా అంక్షలను ఎదరించే దేశాలతో కలిసి పనిచేయాలి. మన స్వతంత్ర విదేశాంగ విధానాన్ని కాపాడుకోవాలి. అమెరికా పాలకులకు ట్రంప్ వంటి నేతలకు లొంగిపోతున్న మోడీ, చంద్రబాబు లాంటి నేతలను నిలదీసి ప్రశ్నించాలి. అన్ని పార్టీల్లోని ప్రజాతంత్ర వాదులు, దేశభక్తులు కదిలిముందుకు రావాలి.

కేంద్ర కమిటీ ప్రచురించిన ఈ పుస్తకాన్ని కిందికి తీసుకెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలని కార్యకర్తలను కోరుతున్నాం.

# సామ్రాజ్యవాద సుంకాల బెదిరింపులు

**ట్రంప్** ప్రభుత్వం మన దేశంతో పాటు అనేక ఇతర దేశాల మీద సుంకాల యుద్ధం ప్రకటించింది. ఒకప్పుడు ఇదే అమెరికన్ సామ్రాజ్యవాదం స్వేచ్ఛా వాణిజ్యం పేరిట వర్ధమాన దేశాలన్నీ వాణిజ్య ఆంక్షలు ఎత్తివెయ్యాలని బలంగా ప్రచారం చేసి, నయానో భయానో ఒప్పించి ఇవాళ స్వేచ్ఛా మార్కెట్లను రక్షిత విధానాల ద్వారా మూతవేస్తూ తన ఆర్థిక – భౌగోళిక రాజకీయ ప్రయోజనాలను సాధించుకోవాలని ప్రయత్నిస్తున్నది. సామ్రాజ్యవాద దుందుడుకు చర్యలు, ఆంక్షలలో భాగంగా ట్రంప్ యంత్రాంగం మొదట మన దేశంపై 25 శాతం సుంకాలు విధించింది. ఆనక మరలా మరో 25 శాతం సుంకాలు విధించడం ద్వారా బ్రెజిల్ మీద విధించినట్లే 50 శాతం సుంకాలు విధించినట్లయింది. రష్యా నుండి మన దేశం చమురు కొనుగోళ్ళు నిలిపి వెయ్యడానికి నిరాకరించడంతో రెండవ దఫా మరో 25 శాతం సుంకాలు విధించారు. అమెరికా సామ్రాజ్యవాదానికి అడుగులకు మడుగులొత్తుతూ పరమ విధేయంగా వ్యవహరిస్తూ వచ్చిన మోడీ ప్రభుత్వానికి ఇది శరాఘాతమే ట్రంప్ ప్రభుత్వం బెదిరింపులకు దిగినా మోడీ ప్రభుత్వ స్పందన తీరు పేలవంగానూ, అవమానకరంగా ఉన్నది.

ట్రంప్ సుంకాలకు మనం వ్యతిరేకం. అదే సందర్భంలో మన వ్యవసాయ రంగానికి, ఇతరత్రా దెబ్బతినే అవకాశాలు ఉన్న పరిశ్రమలకు ఈ సుంకాల భారం నుండి కేంద్ర ప్రభుత్వం తగు రక్షణ కల్పించాలి. రైతుల, కార్మికుల ఆదాయాలను దెబ్బ తియ్యడంతో పాటు ఉపాధి అవకాశాలు కూడా తగ్గిపోయే అవకాశం ఉన్నందున మనం ట్రంప్ సుంకాలను వ్యతిరేకిస్తున్నాం. ఇవే కారణాల రీత్యా కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు సుంకాల భారం నుండి రక్షణ కల్పించేందుకు తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాం. అమెరికా

సామ్రాజ్యవాద దుష్ట పన్నాగాలను మనం వ్యతిరేకించాలి. అమెరికన్ సామ్రాజ్యవాదం ముందుకు తెస్తున్న డిమాండ్లకు మన ప్రభుత్వం ఎలాంటి పరిస్థితులలోనూ తలొగ్గకూడదని ఒత్తిడి పెంచాలి. ట్రంప్ కుయుక్తులను మనం ప్రజాబలంతో తిప్పి కొట్టాలి. మనదేశ సరిహద్దులు దాటి వచ్చే సరుకుల (దిగుమతుల) మీద వేసే పన్నులనే సుంకాలు అంటారు. ఈ సుంకాల మూలంగా దిగుమతులు ప్రియం అయి దేశీయంగా ఉత్పత్తి చేసే సరుకుల ధరలు కూడా పెరుగుతాయి. దిగుమతులపై ఆంక్షలు విధించి దేశీయ సరుకుల ఉత్పత్తికి ప్రోత్సాహకాలు కల్పించడాన్ని రక్షణాత్మక విధానాలు అంటాం. అమెరికన్ వస్తూత్పత్తి పరిశ్రమలు ఇతర దేశాలు ఇస్తున్న పోటీ మూలంగా దెబ్బతిన్నాయి అనేది ట్రంప్ వాదన. కాబట్టి అమెరికాకు పూర్వ వైభవం తీసుకురావడానికే అన్ని దేశాల మీదా సుంకాలు విధిస్తున్నానని వివరణ ఇస్తున్నాడు.

కానీ అమెరికా ప్రపంచంలో ఏ దేశం మీదా విధించనంతటి భారీ స్థాయిలో మనమీద 50 శాతం సుంకాలు విధించింది. రొయ్యలు, తోలు, వజ్రాలు, దుస్తుల పరిశ్రమలు ఈ సుంకాల మూలంగా తీవ్రంగా దెబ్బతింటాయి. సుంకాలు విధించడం మూలంగా మనం చేసే ఎగుమతుల ధరలు పెరిగి ఇతర దేశాల ఎగుమతులతో పోటీ పడే అవకాశాలు సన్నగిల్లుతాయి. మార్కెట్‌లో మన ఎగుమతుల వాటా తగ్గిపోతుంది.

ప్రస్తుతం అమెరికా–భారత్‌ల మధ్య జరుగుతున్న ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పంద చర్చలలో మన దేశాన్ని సుంకాల విధింపు ద్వారా బెదిరించి దారికి తెచ్చుకోవాలనేదే ట్రంప్ పన్నాగం.

ప్రస్తుత నేపథ్యంలో ఇమిడిఉన్న నాలుగు ప్రధాన సమస్యలను మీముందు ఉంచుతున్నాం.

**మొదటిది :** భారతీయ వ్యవసాయ మార్కెట్లలోకి అమెరికన్ దిగుమతులను అనుమతించేలా చెయ్యడం ట్రంప్ కీలక లక్ష్యంలో భాగం.

**రెండవది :** మనదేశంపై ట్రంప్ విధించిన 50శాతం సుంకాల కారణంగా మన ఎగుమతుల మీద ప్రతికూల ప్రభావం పడి ఫ్యాక్టరీల మూతకు, లక్షలాది మంది ఉపాధి కోల్పోవడానికి దారి తీస్తుంది. ఫ్యాక్టరీలు మూతపడడం మూలంగా ఉత్పత్తి దెబ్బతినిపోయి ఆర్థిక వ్యవస్థ మందగిస్తుంది. రూపాయి విలువ పతనానికి, ద్రవ్యోల్బణం పెరుగుదలకు దారి తీస్తుంది.

**మూడవది :** అంతర్జాతీయ ఒప్పందాలను, న్యాయ సూత్రాలను కాలదన్ని ట్రంప్ దుందుడుకు చర్యలకు పాల్పడుతున్నాడు. స్వేచ్ఛా వాణిజ్యం నుండి ట్రంప్

రక్షిత విధానాల వైపుకు ఎందుకు మళ్ళుతున్నాడు? ఈ విధానాల మూలంగా అమెరికా కోల్పోయిన ప్రాభావాన్ని తిరిగి సంతరించుకుంటుందా?

**నాల్గవది :** మన ముందున్న మార్గం ఏమిటి? ట్రంప్‌కు రాయితీలు కల్పించడంలో భాగంగా మన వ్యవసాయరంగాన్ని అమెరికన్ దిగుమతులకు బార్లా తెరిస్తే ఈ రంగం మీద ఆధారపడిన రైతులు, గ్రామీణ కార్మికుల జీవితాలు అస్థవ్యస్థం అయిపోతాయి. దీని మూలంగా మన పరిస్థితి పెనం మీద నుండి పొయ్యిలో పడిన చందంగా తయారవుతుంది. కాబట్టి రైతాంగం, కార్మికులు, ప్రజలు మోడీ ప్రభుత్వం అమెరికన్ సామ్రాజ్యవాద ప్రమాదంతో రాజీపడకుండా నిలువరించడం ఎట్లా? ఇందుకు ప్రత్యామ్నాయం ఏమన్నా ఉందా?

# 1

# పెనం మీద నుండి పొయ్యిలోకి

మన దేశం అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునేలా, అందులో భాగంగా అమెరికన్ వ్యవసాయోత్పత్తుల దిగుమతుల మీద సుంకాలు తగ్గించేలా ఒత్తిడి చెయ్యడం కోసమే ట్రంప్ ఏకంగా 50 శాతం సుంకాలు విధించాడు. అమెరికన్ ఉత్పత్తుల దిగుమతుల మీద మనం విధించిన సగటు పన్నులు 36.5 శాతం. అదే మన ఉత్పత్తుల మీద అమెరికా విధిస్తున్న సగటు పన్నులు 2-4 శాతం. ఇది అన్యాయం కాబట్టి భారతదేశం కొత్తగా తమతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాలని ట్రంప్ అమెరికా అధ్యక్ష పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుండి ఒత్తిడి చేస్తూనే ఉన్నాడు. నాలుగు విడతలుగా ద్వైపాక్షిక చర్చలు జరిగాయి, కానీ ఒక ఒప్పందానికి రావడం కుదరలేదు. ఈ నేపథ్యంలో మన దేశంపై 25 శాతం ప్రతీకార సుంకాలు విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించాడు. మరింత ఒత్తిడి పెంచడానికిగానూ రష్యా నుండి చౌకధరకు చమురు కొనుగోళ్ళు చేస్తున్నందుకుగానూ అదనంగా మరో 25 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించాడు. ఏతావాతా ఆగస్టు నాటికి మన దిగుమతులపై అమెరికా 50 శాతం పన్నులు విధించినట్లు అయ్యింది.

**అమెరికన్ వ్యవసాయరంగంలో సంక్షోభం :**

మనదేశ వ్యవసాయ రంగం పై అమెరికా ఎందుకు అంత గురిపెట్టుకుని ఉన్నది. కారణం చిన్నదే. చైనాతో మొదలు పెట్టిన వాణిజ్య యుద్ధంలో అమెరికాకు దిమ్మ తిరిగిపోయింది. అమెరికా వ్యవసాయ ఉత్పత్తులలో దాదాపు 17 శాతం కేవలం

ఒక్క చైనాయే దిగుమతి చేసుకుంటూ ఉంటుంది. అమెరికా ఏకపక్షంగా సుంకాల యుద్ధానికి తెర లేపాక చైనా అమెరికా నుండి సోయాబీన్ దిగుమతులను గణనీయంగా తగ్గించింది. 2022లో అమెరికా నుండి 34.4 బిలియన్ డాలర్ల విలువ చేసే దిగుమతులు చేసుకున్న చైనా 2024 నాటికి వాటిని 24.5 బిలియన్ డాలర్లకు తగ్గించుకున్నది. తాజా సమాచారాన్ని బట్టి చైనా అమెరికా నుండి సోయాబీన్ దిగుమతులు పూర్తిగా నిలిపివేసి బ్రెజిల్ నుండి కొనుగోళ్ళు మొదలు పెట్టిందని తెలియవస్తున్నది.

అలాగే 2021లో 18.6 బిలియన్ డాలర్ల విలువ చేసే మొక్కజొన్న దిగుమతులు 2024 నాటికి 13.9 బిలియన్ డాలర్లకు తగ్గిపోయాయి. గోధుమల దిగుమతులదీ అదే వరస. వీటి ఫలితంగా చైనాతో అమెరికా వాణిజ్యలోటు 10.7 బిలియన్ డాలర్ల నుండి 31.8 బిలియన్ డాలర్లకు ఎగబాకింది. అమెరికాలో వ్యవసాయ ఉత్పత్తులు పేరుకుపోతున్నాయి. ఈ సంక్షోభం నుండి బయటపడడానికి అమెరికా మనదేశాన్ని లక్ష్యంగా చేసుకున్నది.

**వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతుల మీద మనం ఎక్కువ సుంకాలు ఎందుకు విధిస్తున్నాం :**

భారతదేశం సుంకాలు విధించడంలో చాలా పై మెట్టులో ఉన్నది, 'కింగ్'లా వ్యవహరిస్తుంది అని ట్రంప్ ఆరోపిస్తున్నాడు. మేం ఇండియా వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతుల మీద కేవలం 2-4 శాతం సుంకాలు విధిస్తుంటే ఇండియా మాత్రం మా వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతుల మీద సగటున 36.5 శాతం సుంకాలు విధించడం అన్యాయం కాదా అని వాపోతున్నాడు.

ఏడు సంవత్సరాల పాటు సుదీర్ఘ చర్చల అనంతరం 123 సభ్య దేశాలు కుదుర్చుకున్న ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూ.టి.ఓ) ఒప్పందం నిబంధనల మేరకు భారతదేశానికి ఆ వెసులుబాటు దక్కింది అన్న వాస్తవాన్ని ట్రంప్ విస్మరిస్తున్నాడు. డబ్ల్యూ.టి.ఓ ఒప్పందంలో వ్యవసాయాన్ని చేర్చకూడదని తృతీయ ప్రపంచదేశాలు అన్నీ పట్టుపట్టాయి. ఆహార భద్రత, ఉపాధి అవకాశాల దృష్ట్యా తృతీయ ప్రపంచ దేశాలు లేవనెత్తిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని వ్యవసాయ ఉత్పత్తుల విషయంలో ఆయాదేశాలకు సుంకాల విధింపులో ప్రత్యేక వెసులుబాటు కల్పించాలని నిర్ణయించారు. డబ్ల్యూ.టి.ఓ ఒప్పందం మేరకు భారతదేశం విదేశీ వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతుల మీద 113 శాతం సుంకాలు విధించుకునే హక్కు కలిగి ఉన్నది. కానీ మన దేశం

కేవలం 36.5 శాతం సుంకాలు మాత్రమే విధిస్తున్నది. కాబట్టి ఈ విషయంలో మనదేశం ట్రంప్ అరోపిస్తున్నట్లు అన్యాయంగా వ్యవహరించిందే లేదు.

కానీ ట్రంప్ మాత్రం డబ్ల్యూ.టి.ఓ ఒప్పందాన్ని లెక్క చేయ్యనంటున్నాడు. ఇది బహుళపక్ష ఒప్పందం. అయినా ఖాతరు చెయ్యనంటున్నాడు. మనదేశంలో వ్యవసాయరంగం మెజార్టీ ప్రజానీకానికి జీవనాధారం. కానీ అమెరికాలో పరిస్థితి అది కాదు. రెండవ ప్రపంచ యుద్ధానంతరం కుదుర్చుకున్న 'గాట్' (జనరల్ అగ్రిమెంట్ ఆన్ టారిఫ్ అండ్ ట్రేడ్) ఒప్పందంలో వ్యవసాయాన్ని చేర్చక పోవడానికి కారణం ఇదే. తృతీయ ప్రపంచ దేశాలు ఆహార భద్రత, ఉపాధి అవకాశాల రీత్యా వ్యవసాయరంగాన్ని 'గాట్' ఒప్పందంలో భాగం చెయ్యడానికి నిరాకరించాయి. కానీ 1995లో కుదిరిన డబ్ల్యూ.టి.ఓ ఒప్పందంలో వ్యవసాయం సహా సకల వాణిజ్య కార్యకలాపాలనూ ఒకే గొడుగు నీడ కిందకు తీసుకువచ్చారు. అదే సందర్భంలో వర్ధమాన దేశాలు విదేశీ వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతుల మీద 113 శాతం సుంకాలు విధించడానికి అనుమతించారు. అమెరికా కూడా ఈ బహుళపక్ష ఒప్పందం మీద సంతకాలు చేసింది. తీరా ఇప్పుడు ట్రంప్ ఆ ఒప్పందం మేరకు మన దేశం అమెరికన్ వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతుల మీద విధించిన 36.5 శాతం సుంకాలు అన్యాయం, అక్రమం అని గోల పెడుతూ మనదేశం మీద 50 శాతం ప్రతీకార సుంకాలు విధించాడు.

వ్యవసాయ రంగంలో మనదేశంతో అమెరికా పోలిక పెట్టుకోవడం సబబేనా? అమెరికాలో వ్యవసాయరంగం మీద ఆధారపడిన జనాభా కేవలం 21 లక్షలమంది. అమెరికా మొత్తం జనాభాలో వీళ్ళు 4శాతంగా ఉన్నారు కానీ మన దేశంలో వ్యవసాయరంగం మీద ఆధారపడిన జనాభా 53 కోట్లమంది. మొత్తం జనాభాలో 46శాతం. అమెరికాలో వ్యవసాయం తక్కువ మందితో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహించబడుతుంది. కాబట్టి సగటు తలసరి ఉత్పత్తి మన దేశం కన్నా 460 రెట్లు ఎక్కువగా ఉన్నది. 2023 నాటి గణాంకాలను పరిశీలిస్తే ఒక్కో అమెరికన్ రైతు సగటున 464 ఎకరాల వ్యవసాయం చేస్తుంటే అదే మన దేశంలో రైతు సగటున 2 ఎకరాల వ్యవసాయమే చేస్తున్నాడు. అమెరికన్ రైతుకు ప్రభుత్వం నుండి అందే వ్యవసాయ సబ్సిడీ 61,286 డాలర్లు కాగా మన దేశంలో రైతుకు అందే సబ్సిడీ కేవలం 282 డాలర్లు మాత్రమే. కాబట్టి ఏ రకంగా చూసినా అమెరికన్ రైతు మన దేశపు రైతు సమఉజ్జీలు కారు. అదీగాక అమెరికాలో వ్యవసాయరంగం మీద ఆధారపడిన జనాభా తలసరి సగటు ఆదాయం మనదేశ వ్యవసాయదారుల

తలసరి సగటు ఆదాయం కన్నా 15 రెట్లు ఎక్కువ. మనదేశంలో మొత్తం కార్మికవర్గ జనాభాలో 46శాతం మంది వ్యవసాయరంగం మీద ఆధారపడి జీవిస్తున్నా స్థూలజాతీయోత్పత్తిలో వీరివాటా 16శాతం మాత్రమే. అంటే ఈ రంగం మీద ఆధారపడి జీవిస్తున్నవారిలో అత్యధికులు పొట్టకూటి కోసం ఆధారపడినవారే అని స్పష్టం అవుతున్నది. ట్రంప్ ఇప్పుడు వీరి పొట్టకొట్టాలని చూస్తున్నాడు.

ప్రస్తుతం అమెరికాతో సాగుతున్న ద్వైపాక్షిక వాణిజ్య చర్చలలో నలుగుతున్న అంశాలలో పాడి పరిశ్రమం మొదటి లక్ష్యంగా ఉన్నది. మనదేశ రైతాంగానికి వ్యవసాయానికి తోడు ఆధారంగా ఉన్నది పాడిరంగమే.

**పాడిపరిశ్రమ**

పాడిపరిశ్రమ అనేది మనదేశంలో అనుబంధవృత్తి. కానీ అమెరికాలో అది అంతర్జాతీయ వాణిజ్యస్థాయిలో సాగుతుంది. ఒక్కో అమెరికన్ పాడిరైతు దగ్గర సగటున 337 ఆవులు, 200 గొర్రెలు, 1000 సీమపందులు ఉంటాయి. అదే మనదేశంలో రైతులు దగ్గర మహా అయితే మూడు పాడి పశువులు మాత్రమే ఉంటాయి. 95శాతం పాడిపశువులు వ్యక్తిగత యాజమాన్యంలో ఉన్నాయి. కేవలం 5శాతం పాడిపశువులు వాణిజ్యసంస్థల నిర్వహణలో ఉన్నాయి. క్షీర విప్లవం సహకార సంఘాల ఆవిర్భావం తర్వాత మనదేశం పాల ఉత్పత్తులలో స్వావలంబన సాధించింది. ఇప్పుడు ట్రంప్ అమెరికన్ పాల ఉత్పత్తులను బలవంతాన మనతో మింగించాలని చూస్తున్నాడు. ప్రస్తుతం మనదేశంలో జున్ను మీద 30శాతం, వెన్నమీద 40 శాతం, పాలపొడి మీద 60శాతం దిగుమతుల సుంకాలు విధిస్తున్నాం. ఈ సుంకాలను అమెరికా కోరినట్లు తగ్గిస్తే పాల ఉత్పత్తుల దిగుమతులు 25 మిలియన్ల టన్నులు పెరుగుతాయి. దీని మూలంగా ధరలు 15 శాతం పడిపోతాయి. భారతీయ రైతాంగానికి లక్షామూడువేలకోట్ల రూపాయల (123 బిలియన్ డాలర్ల) నష్టం వాటిల్లుతుందని స్టేట్‌బ్యాంక్ పరిశోధనా విభాగం లెక్క తేల్చింది.

భారతదేశం సుంకాలయేతర ఆంక్షలను కూడా సడలించాలని అమెరికా డిమాండ్ చేస్తున్నది. మనదేశానికి పాలు, పాల ఉత్పత్తులు ఎగుమతి చెయ్యాలంటే ఆయా దేశాలు తమ పాడిపశువుల పోషణలో మాంసాహార ఆధారిత దాణాను ఉపయోగించలేదన్న వెటర్నరీ సర్టిఫికెట్‌ను సమర్పించాలి. సాంస్కృతికపరమైన, మతపరమైన విశ్వాసాల మీద ఆధారపడిన ఈ ఆంక్షలు 'అశాస్త్రీయం, అక్రమ వాణిజ్య నిరోధం' అని గగ్గోలు పెడుతుంది అమెరికా.

అమెరికా డిమాండ్ చేస్తున్న మేరకు పాడి రంగ వాణిజ్య సరళీకరణకు అంగీకరిస్తే మన దేశంలోని అతి పెద్ద పాల సహకార కేంద్రం 'అమూల్' దెబ్బతినిపోతుంది.

అమెరికాలో పాడి రైతులకు సగటున 3800 నుండి 4300 డాలర్ల ప్రభుత్వసబ్సిడీ లభిస్తుంది. అదే మన దగ్గర పాడి రైతులకు లభించే సబ్సిడీ కేవలం 20 నుండి 30 డాలర్లు మాత్రమే. అమెరికా పైన పేర్కొన్న ప్రత్యక్ష సబ్సిడీలకు తోడు పరోక్షంగా మరిన్ని సబ్సిడీలు కల్పిస్తున్నది.

2018లో అమెరికా వ్యవసాయరంగ ఖర్చులకోసం ఐదేళ్ళ కాలానికి 1.5 ట్రిలియన్ డాలర్లు కేటాయించింది. ఇందులో 38 డాలర్లు ధరవరల్లో హెచ్చుతగ్గులకు పరిహారంతో పాటు ప్రత్యక్ష సబ్సిడీలకు కేటాయించింది. 30 బిలియన్ డాలర్లు పాల శీతల గిడ్డంగులకు సబ్సిడీగాను, 326 బిలియన్ డాలర్లు ఆహార కూపన్లకు కేటాయించింది. ఈ ఏడాది 2025లో ఈ పద్దు కింద ఖర్చు 400 బిలియన్ డాలర్లు ఉంటుందని అంచనా.

అదే మన దేశంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వ్యవసాయ సబ్సిడీలు 45 నుండి 50 బిలియన్ డాలర్లు (3.75 నుండి 4.17 లక్షల కోట్ల రూపాయలు) మాత్రమే. ఈ వ్యవసాయ సబ్సిడీలోనే ఎరువుల సబ్సిడీ, నీటిపారుదల కేటాయింపులు, చౌక దుకాణాల ద్వారా 65 కోట్లమందికి అందించే ఆహార సరుకుల సబ్సిడీ, ఉపాధి హామీ పనుల చెల్లింపులు అన్నీ కలిసి ఉన్నాయి. అమెరికాలో రైతాంగ జనాభా కేవలం 20 లక్షల మందే. 75శాతం ఆహార సబ్సిడీ పైతరగతికి చెందిన 10,000 మంది రైతులకు దక్కుతుంది. వాస్తవానికి ప్రపంచంలోనే అత్యధిక సబ్సిడీలు పొందే వ్యవసాయరంగం అమెరికన్ వ్యవసాయరంగమే. కాబట్టి అమెరికన్ వ్యవసాయ, పాడి ఉత్పత్తులు డబ్ల్యూ.టి.ఓ ప్రమాణాల ప్రకారం 'డంపింగ్' కోవకు చెందుతాయి. అమెరికన్ పాల ఉత్పత్తులను తక్కువ సుంకాలతో మన దేశానికి ఎగుమతి చెయ్యడానికి అనుమతిస్తే అది మన దేశ స్వావలంబనకు తీరని నష్టం కలిగిస్తుంది, మన రైతాంగం ఆర్థిక పరిస్థితి చితికిపోతుంది.

**పౌల్ట్రీ (కోళ్ళ పరిశ్రమ)**

అమెరికాలో కోడి కాళ్ళకన్నా బ్రెస్ట్ భాగం తినడానికి ఎక్కువ మక్కువ చూపుతారు. అందుకే అమెరికాలో కోళ్ళ పరిశ్రమ ఎక్కువగా బ్రాయిలర్ కోళ్ళనే పెంచుతుంది. కాళ్ళ భాగాన్ని (లెగ్ పీస్) సబ్సిడీ రేట్లతో ఎగుమతుల మార్కెట్‌లోకి

'డంప్' చేస్తుంటాయి. అమెరికా నుండి ఈ దిగుమతులు అనుమతించడం అంటే మన దేశీయ కోళ్ళ పరిశ్రమ ముఖ్యంగా తమిళనాడులోని నమ్మక్కళ్ వంటి క్లస్టర్లు దెబ్బతినిపోతాయి.

కోళ్ళ పెంపకం, పాడిపశుపోషణలకు సంబంధించి అమెరికా నుండి మనకు జెండర్ పరమైన ప్రమాదం కూడా పొంచి ఉన్నది. ఇవి రెండూ గ్రామీణ మహిళలకు ఇంటిపట్టున స్వయం ఉపాధి కల్పించే రంగాలు. పాడి, కోళ్ళ పెంపకంలో మహిళల పాత్ర ఎక్కువగా ఉండడం మూలంగా కేంద్ర ప్రభుత్వం ఈ మధ్యనే 'కార్మిక శక్తి' (లేబర్‌ఫోర్స్)లో మహిళల భాగస్వామ్యం గణనీయంగా పెరిగింది అని గొప్పలు చెప్పుకున్నది. అమెరికన్ పౌల్ట్రీ దిగుమతులు అనుమతిస్తే ఇది కూడా దెబ్బతినిపోతుంది.

**పంటలు**

వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతుల మీద మన ప్రభుత్వం సుంకాలు తగ్గించిన 2016-17, 2020-21 సంవత్సరాల్లో దేశీయంగా ఆహారధాన్యాల సేకరణ ధరలు పడిపోయాయి. నిజానికి అమెరికాలో వరి ఉత్పత్తి తక్కువ. కానీ సబ్సిడీలు కల్పించడం ద్వారా పెద్ద ఎగుమతిదారీ దేశాల సరసన నిలిచింది. సుంకాలు తగ్గితే కందిపప్పు, ముడి శనగల దిగుమతులు కూడా పెరిగే అవకాశం ఉన్నది.

సుంకాలలో మార్పులకు అనుగుణంగా అమెరికా నుండి ఆపిల్, బాదం, వాల్‌నట్‌ల దిగుమతులు వెల్లువెత్తే అవకాశం ఉన్నది. తాజాగా పతిపరిశ్రమ ప్రమాదంలో పడింది. అమెరికాను సంతృప్తి పరచడానికి మోడీ ప్రభుత్వం పత్తి మీద సుంకాలు 11శాతం తగ్గించింది. దీని మూలంగా అమెరికా నుండి పత్తి దిగుమతులు వెల్లువెత్తుతాయి. ఇప్పటికే మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్ర, కర్నాటక రాష్ట్రాలలో పత్తి అధికంగా పండించే ప్రాంతాలలో తీవ్ర సంక్షోభం నెలకొని ఉన్నది. పత్తి రైతులు అప్పుల ఊబిలో దిగబడిపోయారు. పత్తి రైతుల బలవన్మరణాలు పెరిగాయి. అమెరికా పత్తి దిగుమతుల మీద సుంకాలు తగ్గించడం మూలంగా ఈ పరిస్థితులు మరింతగా దిగజారుతాయి.

'ఆసియాన్' దేశాలతో మోడీ ప్రభుత్వం స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కూర్చుకున్న దరిమిలా ఆదేశాల నుండి దిగుమతులు పెరిగి మన రబ్బరు పరిశ్రమ తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నది. అమెరికా రబ్బరు చెట్లు పెంచే దేశం కాదు. కానీ సింథటిక్ రబ్బర్ ఉత్పత్తిలో అగ్రగామిగా ఉన్నది. అమెరికా ఇప్పుడు ఈ సింథటిక్ రబ్బర్ దిగుమతులు అనుమతించాలని పట్టుపడుతున్నది. దీనికి అంగీకరిస్తే దేశీయ రబ్బరు పరిశ్రమ దివాళా ఎత్తిపోతుంది.

మనదేశం వంట నూనెల దిగుమతిలో అగ్రస్థానంలో ఉన్నది. వీటి మీద సుంకాలు అతి తక్కువగా 10 శాతంగా మాత్రమే ఉన్నాయి. సోయాబీన్ ఆయిల్ ఎగుమతిలో అమెరికా మూడవ అతిపెద్ద దేశంగా ఉన్నది.

అమెరికాతో నడుస్తున్న ద్వైపాక్షిక వాణిజ్య చర్చలలో పేటెంట్ చట్టాలను మరింత బలోపేతం చెయ్యాలని అమెరికా ప్రయత్నిస్తున్నది. విత్తనాల మీద రైతు హక్కులను నీరుగార్చి విత్తన ఉత్పత్తి సంస్థలకు కట్ట బెట్టాలని చూస్తున్నారు.

జన్యు వంగడాల (జి.యం) దిగుమతులను అనుమతించాలని కూడా అమెరికా పట్టుపడుతున్నది. ఏతావాతా ద్వైపాక్షిక ఒప్పందం పేరిట అమెరికా మనదేశంపై రుద్దాలని చూస్తున్న షరతులు మన వ్యవసాయరంగాన్ని వినాశనం చేస్తాయి.

## 2

## ట్రంప్ సుంకాల పర్యవసానాలు

మనదేశం నుండి అమెరికా 80 బిలియన్ డాలర్ల విలువ చేసే సరుకులు, ఉత్పత్తులు దిగుమతి చేసుకుంటోంది. మన వాణిజ్య ఎగుమతుల్లో ఇది 20 శాతం వాటా. అలాగే మరో 40 బిలియన్ డాలర్ల విలువ చేసే సేవలను కూడా ఎగుమతి చేస్తోంది. అమెరికాకు మనం చేస్తున్న 60 శాతం వాణిజ్య ఎగుమతుల మీద ట్రంప్ విధించిన 50 శాతం సుంకాల ప్రభావం పడుతుంది. 60శాతం మీదే ఎందుకని? ట్రంప్ విధించిన సుంకాలు మనం చేసే ఎగుమతులు అన్నింటికీ వర్తించదు. అమెరికాకు కీలకం అని భావించిన ఉత్పత్తులను సుంకాల మోత నుండి మినహాయించింది. ఉదాహరణకు చౌకగా లభించే జనరిక్ మందుల కోసం మనదేశ ఎగుమతులే కీలకం కాబట్టి వాటి జోలికి పోలేదు. ఫార్మారంగం మీద కూడా సుంకాలు విధిస్తానని అడపాదడపా బెదిరిస్తున్నాడు కానీ అదే జరిగితే అమెరికన్ ప్రజానీకం కొనుగోలు చేసే మందుల ధరలు పెరుగుతాయి. ఇది ట్రంప్‌కు రాజకీయంగా నష్టం కాబట్టి బెదిరింపులకే పరిమితం అయ్యాడు. అలాగే కొన్ని అమెరికన్ కంపెనీలు మనదేశంలో సెమి-కండక్టర్లు, సెల్‌ఫోన్ విడిభాగాల తయారీ యూనిట్లు నెలకొల్పాయి. ఇవి లేనిదే సెల్‌ఫోన్, కంప్యూటర్లు తదితర ఉత్పత్తులను అమెరికా అమ్మలేని పరిస్థితి. అందుకే ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులను సుంకాల నుండి మినహాయించారు. అమెరికా విధానాలు స్వీయ ప్రయోజనాలను ఉద్దేశించి రూపొందించబడేవే. సుంకాల మూలంగా ఏయే పరిశ్రమల మీద భారాలు పడతాయనే సంక్షిప్త సర్వే వివరాలు :

**దుస్తులు, వస్త్ర పరిశ్రమ :** ఈ రంగం నుండి అమెరికాకు 11 బిలియన్ డాలర్ల సరుకు ఎగుమతి అవుతోంది. మన అంతర్జాతీయ వస్త్ర వ్యాపారంలో ఇది 26 శాతానికి సమానం ట్రంప్ సుంకాల విధింపు తర్వాత అమెరికాకు 70 శాతం షిప్‌మెంట్ నిలిచిపోయింది. వియత్నాం, బంగ్లాదేశ్‌ల నుండి అమెరికా దిగుమతులు చేసుకుంటోంది. తిరుప్పూర్, నోయిడా, జైపూర్‌లలో కేంద్రీకృతమై ఉన్న ఈ పరిశ్రమల్లో 5 లక్షల మంది ఉద్యోగాలు హరించుకుపోయే పరిస్థితి నెలకొంది.

**వజ్రాలు, ఆభరణాల పరిశ్రమ :** ఈ రంగం నుండి మన అంతర్జాతీయ ఎగుమతుల వాణిజ్యంలో అమెరికాకు 36 శాతం వెళుతున్నాయి. ఇప్పుడు అమెరికా.. పాకిస్తాన్, టర్కీలను ప్రత్యామ్నాయంగా ఎంచుకుంది. సూరత్, జైపూర్ క్లస్టర్లలో ఉన్న ఈ పరిశ్రమల్లో పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు దెబ్బతినే పరిస్థితి నెలకొంది.

**సీ ఫుడ్ (రొయ్యలు, చేపలు) రంగం :** మన సీ ఫుడ్ ఎగుమతులకు అమెరికా ప్రధాన కేంద్రం. దాదాపు 2 బిలియన్ డాలర్ల విలువచేసే ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయి. ఇది మన అంతర్జాతీయ వాణిజ్యంలో 26 శాతానికి సమానం అమెరికా. ప్రస్తుతం ఈక్వెడార్ నుండి దిగుమతులు చేసుకుంటోంది. కోస్తా సముద్రతీర ప్రాంతంలో చేపలు, రొయ్యల వేట మీద ఆధారపడి ఉన్న కోటిన్నర మంది జనాభా జీవితాలు అస్తవ్యస్తంగా మారనున్నాయి. దేశీయ మార్కెట్‌లో కూడా ధరలు దిగజారడంతో ఎగుమతులు నిలిచిపోవడం కన్నా ఎక్కువ నష్టాలు చవిచూస్తున్నారు మత్స్యకార జనాభా.

**తోలు సరుకులు :** మనదేశం నుండి అమెరికాకు 2 బిలియన్ డాలర్ల తోలు ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయి. ఇవి మన అంతర్జాతీయ తోలు సరుకుల ఎగుమతులలో 27 శాతానికి సమానం. అమెరికా ప్రస్తుతం మెక్సికో నుండి దిగుమతి చేసుకుంటోంది. ట్రంప్ సుంకాల విధింపు మూలంగా ఇప్పటికే కాన్పూర్, ఆగ్రాలలోని తోలు ఉత్పత్తుల కర్మాగారాలు అనేకం మూతపడ్డాయి.

**టీ, కాఫీ, సుగంధ ద్రవ్యాలు :** సుగంధ ద్రవ్యాల అంతర్జాతీయ వాణిజ్యంలో 4.7 బిలియన్ డాలర్ల ఉత్పత్తులు ఎగుమతులు చేస్తూ మన దేశం అగ్రగామిగా ఉంది. ఇందులో 17 శాతం అమెరికాకు ఎగుమతులు జరుగుతున్నాయి. టీ కాఫీ ఉత్పత్తులు 2.6 బిలియన్ డాలర్ల మేరకు ఎగుమతవుతున్నాయి. ఇందులో అమెరికాకు చేరే ఎగుమతులు 10 శాతంగా ఉన్నాయి. ట్రంప్ సుంకాల మూలంగా బ్రెజిల్ నుండి కాఫీ, కెన్యా నుండి టీ ఎగుమతులకు, అలాగే వియత్నాం, ఇండోనేషియా,

కొలంబియా దేశాల ఎగుమతులతో మన పోటీ తీవ్రతరం అవుతుంది. అమెరికా ఎగుమతుల మార్కెట్‌ను పోగొట్టుకుంటే ఈ రంగం మీద ఆధారపడిన రైతాంగ ప్రయోజనాలకు నష్టం వాటిల్లుతుంది.

**యంత్రాలు, ఆటో విడి భాగాలు, ఆర్గానిక్ రసాయనాలు :** ఈ ఆధునిక పరిశ్రమల అంతర్జాతీయ ఎగుమతుల వాణిజ్యం 83 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇందులో అమెరికా మార్కెట్ వాటా 12 బిలియన్ డాలర్లు (15 శాతం). ప్రస్తుత సుంకాల విధింపు మూలంగా 70 శాతం అమెరికన్ మార్కెట్ చేజారిపోయే అవకాశం ఉంది.

**జీడిపప్పు, తివాచీ పరిశ్రమలు :** ఈ ఉత్పత్తుల అంతర్జాతీయ ఎగుమతుల వాణిజ్యం విలువ బిలియన్ డాలర్లుగా ఉంది. ఇందులో అమెరికా మార్కెట్ వాటా 25–30 శాతం. ఈ రెండు పరిశ్రమల మీద అధారపడి కేరళలో జీవిస్తున్న 2 లక్షల మంది కార్మికుల మీద ప్రతికూల ప్రభావం పడనుంది.

మొత్తంగా చూస్తే ట్రంప్ సుంకాల మోత మూలంగా 25 నుండి 30 బిలియన్ డాలర్ల (2.2 – 2.6 లక్షల కోట్ల రూపాయల) ఎగుమతులకు నష్టం వాటిల్లనుంది. ఇది స్టాక్ అమ్ముడుపోక ఆర్థికవ్యవస్థకు వాటిల్లే నష్టానికే పరిమితం కాదు. ఈ నిల్వలను ఇతరేతర దేశాలకు ఎగుమతి చేసుకోవచ్చు, లేదూ దేశంలోనే అమ్ముకోవచ్చు. అయితే ఎగుమతులు క్షీణించి పెట్టుబడుల జోరు తగ్గుతుంది. ప్రత్యేకించి వస్తూత్పత్తిదారులు, ఎగుమతిదారులకు నష్టం వాటిల్లుతుంది. ప్రస్తుతం మన ఆర్థికవ్యవస్థ ప్రైవేటు పెట్టుబడుల ఉపసంహరణ సంక్షోభాన్ని చవి చూస్తోంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో స్థూల స్థిర పెట్టుబడుల్లో ప్రైవేటు రంగం వాటా గత 11 ఏళ్లలో ఎన్నడూ ఎరగనంత స్థాయిలో 32.4 శాతం పడిపోయింది. 2015–16లో ఇది 40 శాతంగా ఉండింది. ప్రైవేట్ కార్పొరేట్ రంగం పెట్టుబడులు మదుపు చెయ్యడానికి ఎందుకు వెనుకముందు లాడుతున్నామో అర్థం కాకుండా ఉన్నదని కేంద్ర ఆర్థిక మంత్రి వాపోయారు. ఇప్పుడు ట్రంప్ సుంకాల మోత మూలంగా ఎగుమతుల మీద కమ్ముకుంటున్న నీలినీడలు ఈ పరిస్థితులను మరింత దిగజారుస్తాయి.

అలాగే ఉత్పత్తి రంగం కూడా దెబ్బ తింటుంది. తిరుప్పూర్, సూరత్, నోయిడా, జైపూర్, ఆగ్రా వంటి పారిశ్రామికవాడల్లో లక్షలాది మంది కార్మికుల ఉద్యోగాలు హరించుకుపోయే ప్రమాదం పొంచి ఉన్నది. ఉపాధి కోల్పోయిన కారణంగా వీరి కొనుగోలు శక్తి క్షీణిస్తుంది. ఇది మరలా ఆర్థిక వ్యవస్థలో డిమాండ్ పడిపోవడానికి దారితీస్తుంది.

వీటన్నింటి పర్యవసానంగా స్థూల జాతీయోత్పత్తి మందగిస్తుంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో జి.డి.పి వృద్ధిరేటు 6.5 శాతంగా ఉంది. 2025-26లో ఇది స్వల్పంగా తగ్గే సూచనలున్నాయి. ట్రంప్ తాజాగా సుంకాల మూలంగా జి.డి.పి వృద్ధిరేటు మరింత క్షీణించే అవకాశం ఉంది.

ట్రంప్ సుంకాల మూలంగా మన ఆర్థిక వ్యవస్థకు ఇంకో ప్రమాదం కూడా ముంచుకు వచ్చే అవకాశం ఉంది. (డాలరుతో పోలిస్తే) రూపాయి విలువ మరింత తగ్గే అవకాశం ఉంది. ఎగుమతులు తగ్గడం మూలంగా విదేశీ మారకద్రవ్యం రాబడి తగ్గుముఖం పట్టిన ఫలితంగా రూపాయి విలువ పడిపోనుంది. 2025 మే నెలలో డాలర్ మారకం రేటు 84.33 రూపాయలు కాగా సెప్టెంబరు నాటికి 88.50 రూపాయలకు పెరిగింది. దీని మూలంగా మన దిగుమతులు మరింత ప్రియంగా మారతాయి. ఈ మారకం రేటు తగ్గుదల ఇలానే కొనసాగితే మన దిగుమతులు రానురానూ మరింత ఖరీదయి ద్రవ్యోల్బణం పెరుగుదలకు దారితీస్తుంది.

ట్రంప్ సుంకాల మోత మూలంగా కార్మికవర్గం ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయి. నిరుద్యోగం పెరుగుతుంది. ఆదాయాలు తగ్గుతాయి. ధరలు పెరిగిపోతాయి. అందుకే సుంకాల పేరిట అమెరికన్ సామ్రాజ్యవాదం పన్నిన పన్నాగాలను మనం నికరంగా వ్యతిరేకించాలి.

## 3

## అమెరికా రక్షిత విధానాలు అవలంబించడానికి కారణాలు

అమెరికా, ప్రపంచబాంక్ - ఐ.ఎం.ఎఫ్ - డబ్ల్యూ.టి.ఓ త్రయం ప్రపంచ ఆర్థికవ్యవస్థను నయా ఉదారవాద వ్యవస్థగా మలిచేశాయి. సరుకులు, సేవల స్వేచ్ఛా వాణిజ్యం పేరిట, పెట్టుబడులు, ఫైనాన్స్‌లకు స్వేచ్ఛా ప్రవేశం పేరిట ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థల తలుపులు బార్లా తెరిపించాయి. కానీ ఇవాళ అదే అమెరికా ట్రంప్ హాయాంలో సుంకాలకు మారుపేరుగా మారింది. ఈ తలకిందుల వ్యవహారానికి కారణం ఏమిటి?

ప్రపంచ దేశాలన్నీ 'వాల్యూ చైన్'లో మా దేశాన్ని అనుసరించాల్సిందే అంటూ ఈ మధ్యనే అమెరికన్ విదేశాంగ మంత్రి తలబిరుసు ప్రకటన చేశాడు. కానీ చాలా దేశాలు అమెరికాను మించిపోయాయి. ఇంకొన్ని దేశాలు తమకంటూ ప్రత్యేక

'వ్యాల్యూచైన్'ను నెలకొల్పుకున్నాయి. బ్రిక్స్ దేశాల పర్చేజింగ్ పవర్ పారిటీ (కొనుగోలు శక్తి సామ్యం) 2020లోనే అమెరికా స్థూల జాతీయోత్పత్తిని మించిపోయింది. 2040 నాటికి అమెరికాను మించి చైనా ఎదుగుతుంది అన్న అంచనాలు ఉన్నాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలు కొన్ని అమెరికాకు దాని పాఠం దానికే ఒప్పచెబుతున్నాయి. అందుకే ఆట నియమాలు మార్చడానికి ట్రంప్ ప్రయత్నిస్తున్నాడు.

అమెరికా ఇంకెంత మాత్రం ప్రపంచంలోనే అతిపెద్ద వస్తూత్పత్తి ఆర్థిక వ్యవస్థగా కొనసాగే పరిస్థితిలో లేదని స్పష్టం అవుతోంది. తలకు మించిన వాణిజ్యలోటుతో అమెరికా కుంగిపోయి ఉంది. అయినా ఇప్పటికీ ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతోంది. సేవల రంగంలో అమెరికాకు మిగులు ఉంది. అమెరికన్ కార్పొరేట్ కంపెనీలు ఉత్పత్తి ఖర్చులు తగ్గించుకోవడం కోసం పరిశ్రమలను తృతీయ ప్రపంచ దేశాలకు తరలించాయి. ఈ కారణంగానే వస్తూత్పత్తి రంగంలో అమెరికా వెనుకబడిపోయింది. అయితే అమెరికన్ డాలర్ అంతర్జాతీయ మారకద్రవ్యంగా చలామణీ అవుతున్నందున దాని ఆధిపత్యం ఇంకా కొనసాగుతోంది. అమెరికా ఇవాళ ప్రపంచంలో అత్యంత సంపన్న దేశంగా ఉండడానికి కారణం అది కొనసాగిస్తున్న నయావలస దోపిడి విధానాలు, అమెరికన్ బహుళజాతి కంపెనీలు, ఫైనాన్స్ పెట్టుబడులే. సైనికపరంగా అమెరికాకు ఉన్న ఆధిపత్యం కారణంగా భౌగోళిక రాజకీయాల మీద పట్టు కొనసాగించడానికి ప్రపంచంలో ఏ మూల అయినా జోక్యం చేసుకుంటా ఉంది.

కానీ ట్రంప్ ఇందుకు సరిగ్గా వ్యతిరేకం అయిన కథనాన్ని వినిపిస్తున్నాడు. 'దూరం, దగ్గర దేశాలని లేకుండా, శత్రువా, మిత్రుడా అన్న దానితో నిమిత్తం లేకుండా దేశాలన్నీ అమెరికాను కొల్లగొట్టి, దోచుకుని, బలాత్కరించాయి' అని వాపోయాడు. ఈ పిచ్చి ప్రేలాపనలనే ఆచరణగా మలచడానికి ప్రపంచ దేశాలను మోకాళ్ళ దండ వేయించడానికి సుంకాలను ఆయుధంగా వాడాలని నిర్ణయించుకున్నాడు. నయా ఉదారవాద విధానాల మూలంగా ప్రపంచ దేశాలన్నీ వివిధ ఆర్థికరంగ మార్కెట్ల ద్వారా సరుకులు–సేవల మార్కెట్లలో ఒకదానికొకటి అనుసంధానమై ఉన్నాయి. ప్రపంచీకరణ శకంలో అమెరికా ఏకపక్షంగా విధించిన సుంకాలను ఏ దేశం కూడా ఒక్కటిగా సవాలు చెయ్యలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ బలహీనత గుర్తించే ట్రంప్ ఈ ఆయుధాన్ని పిడి వరకూ ప్రయోగించాలన్న జోరు మీద ఉన్నాడు.

అమెరికాలో వస్తూత్పత్తి పరిశ్రమలు క్షీణించడం మూలంగా నగరాలు గొడ్డుబోయాయి. నిరుద్యోగం పెరిగిపోయింది. ప్రజల జీవన ప్రమాణాలు దిగజారాయి.

వన్నె కోల్పోయిన ఈ పారిశ్రామిక పట్టణ ప్రాంతాలే ఇవాళ ట్రంప్‌కు బలమైన మద్దతుగా నిలిచాయి. సుంకాలు విధించడం ద్వారా దేశాన్ని పునః పారిశ్రామికీకరణ బాట పట్టించవచ్చు అని ట్రంప్ బలంగా నమ్ముతున్నాడు.

అంతర్జాతీయ ఫైనాన్స్ రంగంలో అమెరికా కరెన్సీ డాలరు అంతర్జాతీయ కరెన్సీగా కూడా చలామణి కావడం ఆ దేశానికి కలిసివచ్చింది. ఐరోపా యూనియన్ దేశాల కరెన్సీ యూరో, బ్రిటన్ కరెన్సీ పౌండు కూడా అంతర్జాతీయ కరెన్సీగా చలామణి అవుతున్నాయి గానీ అంతర్జాతీయ మారక ద్రవ్యం, విదేశీ మారక ద్రవ్య నిల్వలుగా డాలర్ కొనసాగడంతో దాని ఆధిపత్యం చలామణీ అవుతోంది. రెండో ప్రపంచ యుద్ధానంతర కాలంలో అమెరికన్ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉండడంతో ఆ దేశ కరెన్సీ డాలర్‌ను అంతర్జాతీయ కరెన్సీగా సభ్యదేశాలు అంగీకరించాయి. డాలర్‌ను బంగారంతో సరిసమానంగా పరిగణిస్తారు కాబట్టి చెల్లింపులకు, సేవింగ్స్‌కు డాలర్‌నే ఎంచుకున్నారు. ఇది అమెరికాకు గొప్ప అవకాశంగా పరిణమించింది. అందుకే తన వాణిజ్యలోటు పూడ్చుకోవడానికి, విదేశీ పెట్టుబడుల నిమిత్తం డాలర్లను ఇష్టారాజ్యంగా ముద్రించుకుంటోంది. వాణిజ్య మిగులు ఉన్న దేశాలు డాలర్లలో చెల్లింపులను స్వీకరించి, ఆ డాలర్లను తమ విదేశీమారక నిల్వలకు జతచేసుకుంటాయి.

నిక్సన్ అమెరికా అధ్యక్షుడిగా ఉన్న కాలంలోనే ఒక ఔన్సు బంగారం ధర 35 డాలర్లుగా స్థిరంగా అట్టే పెడతామన్న వాగ్దానాన్ని అమెరికన్ పాలకులు వమ్ముచేశారు. 'ఆర్గనైజేషన్ ఆఫ్ పెట్రోల్ ఎక్స్‌పోర్ట్ కంట్రీస్' (ఒపెక్) దేశాలు చమురు వ్యాపారం అంతా డాలర్లలోనే చెయ్యాలని, అలా గడించిన పెట్రో–డాలర్లను అమెరికా 'బాండ్' మార్కెట్‌లలో పెట్టుబడులుగా పెట్టాలని నిబంధనలు విధించారు. తద్వారా ఇతర దేశాల సంపదని కూడా అమెరికన్ డాలర్లుగా పోగేసుకుంటున్న చరిత్ర అమెరికాది, కాగా ఇప్పుడు ట్రంప్.. బాధితుడి స్వరం వినిపించడం అర్థం పర్థం లేనిది.

పెట్రో–డాలర్ వ్యవస్థ, అంతర్జాతీయ కరెన్సీగా డాలర్ చలామణీ – ఈ రెండూ ఇవాళా రేపూ కదలబారిపోవడం ట్రంప్ ఆందోళన వెనుక ఉన్న అసలు కారణం. ఇరాక్‌లో సద్దాం హుస్సేన్, లిబియాలో కల్నాల్ గడాఫీలు డాలరు మారకం నుండి పక్కకి జరగడం మూలంగానే అమెరికన్ సామ్రాజ్యవాద పాలకులు ఆ దేశాల మీద దండెత్తి, అంతర్గత కలహాలు సృష్టించి చివరికి ఆ ఇద్దరు దేశాధినేతలను హత్య గావించారు. తాజాగా 'బ్రిక్స్' కూటమి దేశాలు ద్వైపాక్షిక వాణిజ్యాన్ని ఆయాదేశాల స్వంత కరెన్సీల ద్వారానే నడుపుకోవడం మూలంగాను, వీలును బట్టి నూతన

అంతర్జాతీయ కరెన్సీని రూపొందించుకోవాలని నిర్ణయించాయి. దీంతో ట్రంప్ సహనం కోల్పోయాడు. ఈ పరిణామాల మీద చేసిన విద్వేషపూరిత వ్యాఖ్యలు ట్రంప్ దిక్కుతోచని తనానికి అద్దం పడుతున్నాయి.

“బ్రిక్స్ దేశాలు డాలరు నుండి విడగొట్టుకోవాలనే ఆలోచన చేస్తుంటే మేం చేతులు ముడుచుకు చూస్తూ ఊరుకునే సమయం మించిపోయింది. అమెరికన్ డాలర్‌కు ప్రత్యామ్నాయంగా బ్రిక్స్ దేశాలు కొత్త కరెన్సీని సృష్టించడంగానీ, లేదూ అటువంటి ప్రయత్నాలకు అండగా నిలవడంగానీ చేస్తే ఆయా దేశాలమీద 100 శాతం సుంకాలు విధిస్తాను. అమెరికా అద్భుత మార్కెట్‌లో సరుకు అమ్ముకునే అవకాశం లేకుండా చేస్తాను. వేరే వాళ్ళని వెతుక్కోవాలి చీక్కోడానికి. అంతర్జాతీయ వాణిజ్యంలో అమెరికన్ డాలర్‌ను తప్పించే అవకాశం బ్రిక్స్ దేశాలకు దక్కనియ్యను. అలాంటి దేశాలు అమెరికాకు గుడ్‌బై చెప్పి శాశ్వతంగా దూరంగా ఉండాల్సిందే”.

సుంకాల విధింపు ద్వారా ప్రపంచదేశాలను తన పాదాక్రాంతం చేసుకోవాలని ట్రంప్ భావిస్తున్నాడు. మనదేశం కూడా రష్యా తదితర దేశాలతో స్వంత కరెన్సీలోనే అంతర్జాతీయ వాణిజ్యం నెరపుతున్నది. ట్రంప్ తెంపరితనం ఎక్కడికి దారి తీస్తుందో వేచిచూడాలి. బ్రెజిల్‌లో మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సనారో ఎన్నికయిన అక్కడి ప్రజాప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు లేవదీయడానికి ప్రయత్నించాడు అన్న ఆరోపణల మీద న్యాయ విచారణ మొదలు పెట్టారని చెప్పి ట్రంప్ ఆదేశం మీద 50శాతం సుంకాలు విధించాడు. ఇది ఆ దేశ అంతర్గత వ్యవహారం. అంతర్జాతీయ వాణిజ్యానికి ఏమాత్రం సంబంధంలేనిది. అయినా బ్రెజిల్ మీద ప్రతీకార సుంకాలు విధించాడు. ఇంతకన్నా దుర్మార్గం మరొకటి ఉంటుందా?

సుంకాలను అమెరికన్ బడ్జెట్‌కు ఆదాయ వనరుగా పరిగణిస్తున్నాడు ట్రంప్. అమెరికన్ ఖజానాకు అదనంగా ఒనగూడే ఈ ఆదాయాన్ని పోనీ ఆ దేశప్రజానీకాన్ని ఉద్ధరించడానికి ఖర్చు చేస్తాడా అంటే అదీలేదు. ‘వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్’ (భారీ అద్భుత బిల్లు) పేరిట సంపన్నులకు రాయితీలు కల్పించడానికి, దివాళా ఎత్తిపోయిన పెట్టుబడిదారీ కార్పొరేట్ సంస్థలకు సాయం కల్పించడానికి నిర్ణయించాడు. వ్యూహాత్మకమైన కీలక రంగాలలో దేశీయ పెట్టుబడులను ప్రోత్సహించే పేరిట మతిచెడిపోయేంత భారీ మొత్తాలను ప్రైవేట్ కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టాడు. వనరుల సమీకరణకు సుంకాలే తారకమంత్రంగా భావిస్తున్న ట్రంప్ అమెరికన్ బడ్జెట్ లోటును అధిగమించడానికి కూడా ఇదే మార్గం అని తలపోసాడు.

సుంకాలు పరోక్షంగా అమెరికన్ వినియోగదారుల మీద విధించే పన్నులు కూడా అన్న వాస్తవం మనం గుర్తించాలి. దిగుమతులు ప్రియం కావడం మూలంగాను, దేశీయ ఉత్పత్తి ఖర్చులు పెరగడం మూలంగానూ ధరల పెరుగుదల సంభవిస్తుంది. ఇది ద్రవ్యోల్బణానికి దారితీసి అంతిమంగా కార్మికుల నిజవేతనాలు క్షీణిస్తాయి.

సుంకాలు, సంబంధిత విధానాల్లో చీటికీమాటికీ మార్పుల మూలంగా పెట్టుబడుల వాతావరణం మీద ప్రతికూల ప్రభావం పడుతుంది. ఇప్పుడు ఉన్న సుంకాల రక్షణ ఆధారంగా ఎవరన్నా భారీ పెట్టుబడులతో ఉత్పత్తి కర్మాగారాన్ని ప్రారంభిస్తే ఈ రక్షణ భవిష్యత్తులో ఎంతకాలం కొనసాగుతుంది అనే గ్యారంటీలేదు, నూతన ఉపాధి అవకాశాలు సన్నగిల్లడం మూలంగా ఇప్పటికే అమెరికాలో ఆర్థికవృద్ధి రేటు తగ్గుముఖం పట్టింది. 2024లో అమెరికన్ ఆర్థికవ్యవస్థ వృద్ధిరేటు 2.80శాతం కాగా ఈ ఏడాది వృద్ధిరేటు 2శాతం కన్నా తక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నారు.

ట్రంప్ అనుసరిస్తున్న విధానాల మూలంగా అమెరికన్ ఆర్థికవ్యవస్థ 'స్టాగ్‌ఫ్లేషన్' దశకు (ద్రవ్యోల్బణం, ఆర్థికస్థబ్దత) చేరుకుంది. వృద్ధిరేటు ఈడికగా కొనసాగుతున్నది. విశ్వవిద్యాలయాల మీద ఆంక్షలు, అశాస్త్రీయమైన భావజాల ప్రచారం, వలసల నిరోధం వంటి ట్రంప్ దుందుడుకు చర్యల మూలంగా శాస్త్ర, సాంకేతిక పరిశోధనలు వెనుకపట్టు పడుతున్నాయి. ట్రంప్ అనుసరిస్తున్న విధానాలు అమెరికన్ ఆర్థికవ్యవస్థను అతలాకుతలం చేస్తున్నాయి. ఇంకా చెప్పాలంటే ఈ విధానాలు అమెరికన్ సామ్రాజ్యవాద బలహీనతను వెల్లడి చేస్తున్నది.

## 4

## మార్గాంతరం ఏమిటి?

ట్రంప్ విధించిన సుంకాల మూలంగా అమెరికా–భారత్‌ల మధ్య సాగుతున్న ద్వైపాక్షిక వాణిజ్య చర్చలు అర్థాంతరంగా నిలిచిపోయాయి. సెప్టెంబరు నెలలో ఢిల్లీలో ఈ చర్చలు పునఃప్రారంభమయ్యాయి.

మనదేశాన్ని లొంగదీసుకోవడానికి అమెరికా వివిధ రూపాల్లో ఒత్తిడి పెంచుతున్నది. హెచ్1–బి వీసాల రుసుం లక్ష డాలర్లకు (88 లక్షల రూపాయలు) పెంచడం ఇందులో భాగమే. హెచ్1–బి వీసాల మీద విధిస్తున్న ఆంక్షల మూలంగా వేలాది మంది భారతీయ వృత్తి నిపుణుల కెరీర్ డోలాయమాన పరిస్థితుల్లోకి నెట్టబడింది. ఇరాన్‌లో మనదేశం నిర్మిస్తున్న చాబహార్ నౌకాశ్రయం మీద మరలా ఆంక్షలు విధించింది అమెరికా. 'నాటో'ను తూర్పు దిశగా విస్తరించరాదు అన్న

ఒప్పందాన్ని పక్కన పెట్టి ఉక్రెయిన్ తదితర దేశాలకు 'నాటో' కూటమిలో సభ్యత్వం ఇవ్వడానికి చురుగ్గా ప్రయత్నిస్తున్న నేపథ్యంలో రష్యా–ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధం మొదలయ్యింది. ఉక్రెయిన్‌కు అమెరికా ఆయుధ, ఆర్థిక సాయాలు అందిస్తూ ఈ యుద్ధజ్వాలలను మరింత పేట్రేగేలా చేసింది. కాగా ఐక్యరాజ్య సమితి సర్వ సభ్య సమావేశాల్లో ట్రంప్ ప్రసంగిస్తూ ఉక్రెయిన్ యుద్ధానికి భారత్, చైనా దేశాలే కారణం అని నిందించాడు. ఈ వంకన రాబోయే కాలంలో అమెరికా మరిన్ని తెంపరి చర్యలకు పాల్పడే అవకాశం ఉన్నది.

అమెరికా అనుసరిస్తున్న దుర్మార్గ వైఖరిని నికరంగా ఎదుర్కోవడానికి బదులుగా మోడీ ప్రభుత్వం సందర్భశుద్ధి లేకుండా స్వావలంబన జపం మొదలు పెట్టింది. దేశప్రధాని ఇలా డొంక తిరుగుడు వైఖరి చేపట్టడం, విదేశాంగ వ్యవహారాల మంత్రి పేలవంగా స్పందించిన తీరు మనదేశానికే తీరని అవమానం. ప్రతీకార సుంకాలు విధించడానికి తోడుగా ట్రంప్ వాడిన అభ్యంతరకర భాష పట్ల మన ప్రభుత్వం కనీస నిరసన తెలియచెప్పలేకపోవడం మన విదేశాంగ విధాన వైఫల్యానికి తార్కాణం.

అమెరికా దుందుడుకు చర్యలను ఎలా ఎదుర్కోవాలి అనేదానికి మనముందు రెండు ఉదాహరణలు ఉన్నాయి.

ఐరోపా యూనియన్ దేశాలు అమెరికాకు అనుంగుమిత్రులు. తొలుత కొంత వ్యతిరేకత ప్రదర్శించినా చివరికి అమెరికా ఆ దేశాల మీద రుద్దిన ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాల మీద సంతకాలు చేసాయి. ఈ ఒప్పందం దరిమిలా ఐరోపాదేశాలు అమెరికన్ దిగుమతుల మీద సుంకాలు విధించడానికి వీల్లేదు, కానీ అమెరికాకు చేసే ఎగుమతుల మీద 15శాతం సుంకాలు చెల్లించాలి. దానితో పాటు చౌకధరకు లభించే రష్యా చమురు, సహజవాయువులకు బదులు అమెరికన్ బహుళజాతి కంపెనీల నుండి అధిక ధరలకు కొనుగోళ్ళు చెయ్యాలి. ఇది లొంగుబాటు ఒప్పందం వినా మరొకటి కాదు.

ఇందుకు భిన్నంగా చైనా, బ్రెజిల్ దేశాలు అమెరికా బెదిరింపులకు ఎంత మాత్రం తొణకలేదు, ఎలాంటి తొందరపాటు, లొంగుబాటు ఒప్పందం మీద సంతకాలు చెయ్యలేదు. దాంతో అమెరికా తన బెదిరింపులను కట్టిపెట్టి చైనాతో చర్చలు మొదలుపెట్టింది. ఉభయత్రా ప్రయోజనకరంగా ఉండే ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలు అయితేనే ముందుకు వస్తాం అని చైనా స్పష్టమైన వైఖరి తీసుకున్నది. తమ దేశ ప్రయోజనాలే తమకు ముఖ్యం అని చాటి చెప్పింది.

ఈ నేపథ్యంలో మనదేశం అభివృద్ధి చెందుతున్న దేశాల కూటమి అయిన బ్రిక్స్‌తో సమర్ధవంతంగా వ్యవహరిస్తూ అమెరికా సుంకాల బెదిరింపులను ఎదుర్కోవాలి. ఈ మధ్యనే టియాన్జిన్‌లో రెండురోజుల పాటు సాగిన షాంఘై కోపరేషన్ సదస్సు వివిధదేశాలపై సుంకాలు విధించడం, రష్యాతో వాణిజ్య సంబంధాలు తెగతెంపులు చేసుకోవాలన్న బెదిరింపులకు పాల్పడుతున్న అమెరికా వైఖరిని తీవ్రంగా ఖండిస్తూ ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించాయి. దక్షిణాది దేశాల ఆర్థిక ప్రయోజనాల కోసం షాంఘై కోపరేషన్ బ్యాంక్‌ను నెలకొల్పాలని నిర్ణయించాయి. బహుళధృవ ప్రపంచానికి, అంతర్జాతీయ శాంతి, సౌభ్రాతృత్వాలకు కట్టుబడి పనిచెయ్యాలని నిర్ణయించాయి. ఈ సదస్సు నిర్ణయాలమీద ట్రంప్ స్పందిస్తూ ఈ దేశాలన్నీ అమెరికాకు వ్యతిరేకంగా కుట్ర చేస్తున్నాయని, పసలేని ఆరోపణలు చేసాడు. ఈ సదస్సు వాషింగ్టన్‌ను ఆత్మరక్షణలో పడేసింది అనడానికి ట్రంప్ వ్యాఖ్యలే నిదర్శనం. అమెరికన్ ఆధిపత్యానికి వ్యతిరేకంగా వర్ధమాన దేశాలు చైనా, రష్యా దేశాల సరసకు చేరడం అమెరికన్ సామ్రాజ్యవాద పాలకులకు వణుకు పుట్టిస్తుంది. ప్రపంచ వ్యాప్త పరిణామాలను గమనంలోకి తీసుకుని మన ప్రభుత్వం అమెరికన్ ఏకపక్ష దుందుడుకు చర్యలను ప్రతిఘటిస్తున్న దేశాలతో చేతులు కలిపి అమెరికా ఒత్తిడులను, బెదిరింపులను సమర్ధవంతంగా ఎదుర్కోవాలి.

అయితే బిజెపి సంకీర్ణ కేంద్ర ప్రభుత్వం మాత్రం అమెరికా కోరినట్లు మన ఆర్థిక వ్యవస్థను మరింత బార్లా తెరిచేందుకు సుముఖంగా ఉన్నట్లు వ్యవహరిస్తున్నది. 'అమెరికా దిగుమతులు కొనసాగడానికి, ఎగుమతులలో భవిష్య లాభాల కోసం మనదేశ ఆర్థికవ్యవస్థను వ్యూహాత్మకంగా మరింత బార్లా తెరవాలని' 2025 మే నెలలో నీతి ఆయోగ్ ఒక పత్రం విడుదల చేసింది. అయితే దేశ వ్యాప్తంగా పెద్దఎత్తున నిరసనలు వ్యక్తం కావడంతో ఈ పత్రాన్ని ఉపసంహరించుకున్నది. మన వ్యవసాయరంగాన్ని కార్పొరేటీకరించి, త్వరితగతిన ఆధునీకరించి ఎగుమతి ఆధారితరంగంగా మలచాలి అనేది బిజెపి వైఖరి. మన వ్యవసాయ రంగాన్ని కూడా బార్లా తెరవడం అనేది అమెరికా ప్రతిపాదిస్తున్న ద్వైపాక్షిక ఒప్పందంలో భాగమే గతంలో మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు వ్యవసాయ నల్లచట్టాలు ఇందుకు ముందస్తు చర్యయే. అయితే రైతాంగం సమరశీల పోరాటం ద్వారా ఈ చట్టాలను వెనక్కి తిప్పికొట్టాయి.

అది దృష్టిలో ఉంచుకుని మోడీ ప్రభుత్వం మనదేశ ప్రయోజనాలను అమెరికన్ సామ్రాజ్యవాదానికి తాకట్టు పెట్టకుండా నిలవరించడానికి కష్టజీవులను పెద్ద ఎత్తున ఆందోళనా, పోరాటాలలోకి సమీకరించాలి. గతంలో రైతాంగం తదితర తరగతులు నిర్వహించిన పోరాటాల మూలంగా గత లోక్‌సభలు ఎన్నికలలో బిజెపి లక్ష్యంగా పెట్టుకున్న మూడింట రెండు వంతుల మెజార్టీ సాధించలేకపోయింది. ఆఖరికి సాధారణ మెజార్టీకి కూడా ఆమడదూరంలో నిలిచిపోవాల్సిన పరిస్థితికి నెట్టబడింది. అందుకే అమెరికా కోరినట్లు ఒప్పందం మీద సంతకాలు చెయ్యడానికి మోడీ ప్రభుత్వం ముందువెనుక లాడుతున్నది. రైతాంగం, వ్యవసాయ కార్మికులను మరింత మూలకు నెట్టడం బిజెపికి సాధ్యమయ్యే పనికాదు, వ్యవసాయ చట్టాల్లో మార్పులకు తీవ్ర ప్రతిఘటన ఎదురవ్వక తప్పదు.

ట్రంప్ సుంకాల విధింపు మూలంగా దెబ్బతిన్న చిన్న-మధ్య తరహా పరిశ్రమలు, కార్మికులు, రైతాంగానికి ఊరట కల్పించడానికి మోడీ ప్రభుత్వం సత్వరమే ఆర్థిక ప్యాకేజీ ప్రకటించాలి. అలాగే సుంకాల మూలంగా నష్టపోతున్న మత్స్యకారులు, రొయ్యల సాగుదార్లకు కూడా ప్రత్యేక ప్యాకేజీ అందించాలి. వ్యవసాయ రంగం, అసంఘటితరంగాల్లోని కార్మికులకు సామాజిక భద్రతాప్రయోజనాలు కల్పించాలి. ఇందుకు అవసరమైన ఆర్థిక వనరుల కోసం శతకోటీశ్వరులు, సంపన్నుల మీద పన్నులు విధించాలి.

ఇప్పటివరకూ అమెరికాకు చేస్తున్న ఎగుమతులను వివిధ దేశాల మార్కెట్లకు ఎగుమతి చేసే అవకాశాలతో పాటు, దేశీయ వినియోగం పెంచేదానికి తగిన చర్యలు చేపట్టాలి. రొయ్యలు, చేపలు, వస్త్రపరిశ్రమలకు తగినన్ని ప్రోత్సహకాలు కల్పించాలి.

2022 ఏప్రిల్ నుండి 2025 ఆగస్టు వరకు రష్యా నుండి చౌకగా చమురు దిగుమతులు చేసుకోవడం ద్వారా మనదేశం 17 బిలియన్ డాలర్లను ప్రత్యక్షంగా ఆదా చేసుకున్నదని రాయిటర్స్ సంస్థ వెల్లడించింది. నిజానికి ఈ మిగులు సొమ్ముని అధికాధికంగా అంబానీ, ఆదానీల చమురు కంపెనీలు దిగమింగాయి. చౌకధరకు చమురు లభించినా ఆ లబ్ధి వినియోగదారులకు చేరలేదు. రష్యా నుండి మనదేశం చమురు కొనుగోలు చేసి ఉండకపోతే రష్యా చమురు ఉత్పత్తిని తగ్గించుకునేది. దాని మూలంగా ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు పెరిగేవి. ఆ రకంగా మనదేశం పరోక్షంగా కూడా లాభపడింది.

మోడీ ప్రభుత్వం పారిశ్రామిక సంస్థలతో చర్చలు నడిపి 'ఉత్పాదక ఆధారిత ప్రోత్సాహకాల' పథకాన్ని ప్రకటించింది. అలాగే ఎగుమతి ప్రోత్సాహకాలు ప్రకటించింది. కానీ కార్మికులకు, రైతాంగానికి ఏం మేళ్ళు చెయ్యాలనే ఆలోచనే చెయ్యలేదు. కార్మిక, రైతు సంఘాలతో చర్చించిందేలేదు. సామ్రాజ్యవాద దాడిని తిప్పికొట్టాలంటే ఆయా రంగాల ప్రతినిధి సంఘాలతో పాటు అన్ని రాజకీయ పక్షాలతో విస్తృతంగా చర్చలు జరిపి మనదేశ ప్రయోజనాలు కాపాడుకోవడానికి ఏకోన్ముఖంగా కృషి చెయ్యాల్సిన కీలక సమయంలో బిజెపి ఒంటెత్తు పోకడలు పోతున్నది. ఇప్పటికీ ప్రజల మధ్యన మతాలవారీ, కులాలవారీ ఎలా చిచ్చుపెట్టాలి, తద్వారా ఎలా రాజకీయ లబ్ధి పొందాలి అన్న యావ తప్ప బిజెపికి మరొక అజెండాలేదు. అందుకే అమెరికన్ సామ్రాజ్యవాద దుష్ట పన్నాగాలను ఎదుర్కొనడానికి, బిజెపి ప్రభుత్వం కార్మికవర్గ ప్రయోజనాలను ఫణంగా పెట్టకుండా నిలవరించడానికి విశాల ప్రాతిపదికన కార్మిక-కర్షక ఐక్య ఉద్యమాలను చేపట్టాలి.

*

ప్రతులు : 25000 ప్రచురణ కాలం : అక్టోబర్, 2025 వెల : రూ. 5/-

169711

ప్రచురణ

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), ఆంధ్రప్రదేశ్ కమిటీ

27-30-9, గవర్నర్‌పేట, విజయవాడ - 2

ఫోన్ నెం. 0866-2577202